క్లుప్తంగా

12 నెలల జీతం ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంవత్సరంలోని 12 నెలలు జీతం ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా లోని ప్రైవేటు విద్యా సంస్థల అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న ఉపాధ్యాయులకు యాజమాన్యాలు తగిన రీతిలో ఆదుకోవడం లేదన్నారు.

మందుల పంపిణీ



మందులను అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సోమవారం గ్రామీణ ప్రజలకు ఆరోగ్యం చేకూర్చే మందులను అందజేసింది. సంస్థ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్‌రెడ్డి ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆలంఖాన్‌పల్లె కమలానగర్‌లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిని కలిసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 35 కుటుంబాలకు ఆయన ఆరోగ్య కిట్లను అందజేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సోమవారం కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో దేవుని కడప, పాత కడప, ఎస్.సీ కాలనీ, మోడమీదపల్లి రహదారుల మీదుగా 'ఫ్లాగ్ మార్చ్' కొనసాగింది. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

జియో పజిల్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ సుధాకర్

వైవీయూ : వైవీయూ విద్యార్థులు జాతీయ స్థాయి జియో పజిల్ పోటీల్లో సత్తా చాటి అగ్రస్థానంలో నిలిచారు. ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో ఎ.జి.ఇ- 24 (ఆస్పైరింగ్ జియాలజిస్ట్ ఎక్స్‌ట్రావాగాంజా) పేరుతో జాతీయస్థాయి ఈవెంట్ నిర్వహించారు. ఇందులో వైవీయూ భూగర్భ శాస్త్ర విద్యార్థులు నితిన్, కేఎస్ఎస్ వర ప్రసాద్, ఎం. కిరణ్ కుమార్, కె. ఇమ్మాన్యుయేల్, జి. విజయ్, ఎం. తరుణ్, కళ్యాణ్ జియో పజిల్‌లో ప్రథమ స్థానం, జియో క్విజ్‌లో ద్వితీయ స్థానం లో నిలిచి ప్రశంసా పత్రం అందుకున్నారు. వీరిని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథ్ రెడ్డి అభినందించారు.

'బిషప్ సగిలి' పట్టాభిషేకానికి తరలిన విశ్వాసులు



బస్సు వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవ గురువు

కడప కల్చరల్ : బిషప్ సగిలి ప్రకాశ్ పట్టాభిషేక ఉత్సవానికి కడప నుంచి విశ్వాసులు విశేష సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఖమ్మంలో ఆయన బిషప్‌గా పట్టాభిషేకం పొందుతున్న ఘట్టాన్ని తిలకించేందుకు స్థానిక విశ్వాసులు ప్రత్యేక బస్సులో సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ విల్సన్‌తో కలిసి ఆయన జెండా ఊపి, ప్రార్థన చేసి బస్సులను ప్రారంభించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో దివ్య కారుణ్య బృహత్ దేవాలయం కరుణగిరి ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు బిషప్ పట్టాభిషేకం జరుగుతుందన్నారు.

రాష్ట్ర గౌరవాన్ని పెంచిన 'తెలుగు తల్లి' గీతం

కడప కల్చరల్ : శంకరంబాడి సుందరాచారి రాసిన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతం మన రాష్ట్ర గౌరవ ప్రతిష్ఠలను పెంచిందని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. శంకరంబాడి సుందరాచారి 47 వ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం కడప నగరంలోని రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సుందరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత అధ్యాపకులు కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, మందల మురళి, ప్రకాశం, బాల ఓబయ్య, మోతుకూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది

– రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష

కడప కార్పొరేషన్: రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక 28వ డివిజన్‌లోని బండ్లమిట్టలో కార్పొరేటర్ ఆరీఫుల్లా బాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య సోదరభావం, ఆత్మీయతలను పరిమళింపజేస్తాయన్నారు. ఈ మాసంలో విశ్వశాంతి కోసం అల్లాహ్‌ను ప్రార్థించడం జరుగుతుందన్నారు. పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలం అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి.. రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రతి ఒక్కరూ దైవం అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, మాజీ డిప్యూటీ మేయర్ నబి రసూల్, నగర అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, పవర్ అల్తాఫ్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

బీజేపీని ఓడించేందుకే ఇండియా కూటమి ఏర్పాటు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని బీజేపీ దెబ్బ తీస్తోందని, అటువంటి పార్టీని ఓడించేందుకే ఇండియా కూటమి ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు హత్య కేసులో ప్రధాన నిందితుల పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి కేసీ బాదల్ల, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, వి.గంగా సురేష్, జిల్లా సమితి సభ్యులు జి.వల్లరాజు, బి.వెంకట రాములు, భాగ్యలక్ష్మి, పి. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

11న శ్రీ అవధూతేంద్రస్వామి ఆరాధన ఉత్సవం

కడప కల్చరల్ : కడప నగరం పాత బస్టాండులోని శ్రీ అవధూతేంద్ర స్వామి జ్ఞాన మందిరం 46వ ఆరాధన మహోత్సవం ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 11న ఉదయం 4 నుంచి 5 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేక, 5 గంటల నుంచి సర్వదర్శనం నిర్వహిస్తారు. అనంతరం అగ్నిమాపకశాఖ కార్యాలయ ఆవరణలోని బృందావనం వద్దనుంచి పూర్ణకుంభ కలశాన్ని ధార్మిక వేత్త పోతుల వెంకట్రామిరెడ్డి కుమారుడు టి.శివరామిరెడ్డి మంగళ వాయిద్యాల మధ్య ఆలయానికి చేర్చనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ, రాత్రి 7 గంటల నుంచి హరికథ, అన్నమయ్య సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం ఉగాది నుంచి ఈనెల 19వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం వేద పండితులు చక్రవర్తుల నాగాంజనేయశర్మ శ్రీ క్రోధి నామ సంవత్సరంపై పంచాంగ పఠనం చేయనున్నారు. బుధవారం ఉదయం స్త్రీ, పురుషులకు రామాయణంపై వక్తృత్వ పోటీ నిర్వహించనున్నారు. గురువారం స్త్రీ, పురుషులకు రామాయణ వస్తువులపై ధారణ శక్తి పోటీలను నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం మహిళలకు సరదా ఆటల పోటీ, శనివారం ఉదయం ఏకాదశ శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, ఆదివారం ఉదయం మహిళలకు సంప్రదాయ వంటల పోటీ, 15న ఉదయం రామాయణంపై క్విజ్ పోటీ, 16న ఉదయం సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. 17న ఉదయం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 18న సాయంత్రం శ్రీ సీతారాములకు మహా పట్టాభిషేకం, 19న రాత్రి పుష్పయాగం నిర్వహిస్తారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌లో నివాసం వుంటున్న మహిళ మెడలో నుంచి బంగారు చైన్‌ను లాక్కెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ నరసింహారెడ్డి తెలియజేశారు.

సోమవారం కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను తెలియజేశారు. సంఘటన జరిగినప్పటి నుంచి కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పర్యవేక్షణలో చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్‌లు తమ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. బాధిత మహిళ తన ఇంటి ముందు కసువు ఊడ్చుతుండగా మెడలోనుంచి లాక్కెళ్లినట్లు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో అన్నమయ్య జిల్లా నందలూరు మండలం, భరత్‌నగర్-2కు చెందిన మోదుగుల చంద్రమౌళి అనే వ్యక్తి మహిళ మెడలో నుంచి బంగారుచైన్‌ను లాక్కెళ్లాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని పాతబైపాస్ రోడ్డులోని బ్రహ్మయ్య షెడ్డు వద్ద అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 35 గ్రాముల బంగారుచైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పత్రికా రంగానికి గౌరవం కల్పించిన ఏఎస్ రామన్

కడప కల్చరల్ : సుప్రసిద్ధ పాత్రికేయులు, సంపాదకులు ఏఎస్ రామన్ తన రచనలతో పత్రికా రంగానికి గౌరవ ప్రతిష్ఠలు కల్పించారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి అన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం ఏఎస్ రామన్ 106వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆచార్య టి.రామప్రసాద రెడ్డి ఆ కేంద్రం సిబ్బందితో కలిసి రామన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఏఎస్ రామన్ సేవలను వివరించారు. ఆయన ప్రముఖులతో చేసిన ఇంటర్వ్యూలను గుర్తుచేశారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సమయం మార్పు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల సమయాన్ని మార్పు చేయాలని ఎస్‌టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత కొద్ది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. వీటితోపాటు వడగాల్పులు కూడా వీస్తున్నాయన్నారు. ఈ ఎండలు, వడగాల్పుల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున విద్యాశాఖ అధికారులు సమస్యను గుర్తించి పాఠశాలలను ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉండే విధంగా సమయాన్ని మార్చాలన్నారు. అదే విధంగా పరీక్ష సమయాన్ని కూడా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే విధంగా ఉత్తర్వును ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు తుపాకుల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా నాయకులు బాలకృష్ణ, సాగర్, చంద్రశేఖర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయించుకోవడం చట్టరీత్యానేరం



బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న, న్యాయశాఖ విభాగం సిబ్బంది

కడప అర్బన్: చిన్నపిల్లలతో పనులు చేయించుకోవడం చట్టరీత్యానేరమని, వయసు ధృవీకరణ పత్రాలు తీసుకుని షాపులలో పనులు చేయించుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ ఎం. శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. మనోహర్‌లు అన్నారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత సూచనల మేరకు 'నిర్బంధిత కార్మికుల రక్షణ, పునరావాసం' కార్యక్రమాలకు సంబంధించి ఆర్‌కెఎం స్ట్రీట్, హౌస్ స్ట్రీట్, మద్రాస్ రోడ్‌లలో వున్న లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీసు అధికారులు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రెస్క్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ ఎం. పాల్ జాన్సన్, జి. శ్రీనివాసరెడ్డి, కె. మునుస్వామి, దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొగ్గుల గుర్రప్ప

– ప్రధాన కార్యదర్శిగా వై.టి.జాన్సన్ కెనడి
– స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎస్. చిన్నయ్య విజయం



నూతనంగా ఎన్నికైన కడప బార్ అసోసియేషన్ కమిటీని అభినందిస్తున్న న్యాయవాదులు

కడప అర్బన్: కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం)కు సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది బొగ్గుల గుర్రప్పనాయుడు 16 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 639 ఓట్లకుగాను, 571 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షపదవికి పోటీ చేసిన బొగ్గుల గుర్రప్పనాయుడుకు 292 ఓట్లు పోలయ్యాయి. జీ.వి రాఘవరెడ్డికి 276 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన వై.టి జాన్సన్ కెనడీ 50 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శికి పోటీచేసిన వై.టీ జాన్సన్ కెనడీకి 310 ఓట్లు పోలయ్యాయి. వి. చంద్రవదనకు 260 ఓట్లు వచ్చాయి. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పోటీచేసిన ఎస్.చిన్నయ్య 70 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పోటీ చేసిన ఎస్. చిన్నయ్యకు 319 ఓట్లు పోలయ్యాయి. జె. విజయకుమార్‌కు 249 ఓట్లు వచ్చాయి. కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికల్లో అధ్యక్షులుగా విజయం సాధించిన బొగ్గుల గుర్రప్ప నాయుడుకు, ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన వై.టి జాన్సన్ కెనడీకి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా విజయం సాధించిన ఎస్. చిన్నయ్యకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పెద్దిరెడ్డి జయరామిరెడ్డి చేతుల మీదుగా గెలుపొందిన పత్రాలను అందచేశారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా పి. చంద్రమోహన్, కోశాధికారిగా ఎం.వి సుబ్బరామయ్య, లైబ్రరీ సెక్రటరీగా పి. నాగభూషణం, సెక్రటరీ-1 గా ఏ. రవీంద్రారెడ్డిలు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కడప బార్ అసోసియేషన్ కమిటీకి సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

బాబు కళ్లలో ఆనందం చూడటానికి షర్మిల విమర్శలు

– వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ తదితరులు

కడప కార్పొరేషన్: చంద్రబాబు కళ్లలో ఆనందం చూడటానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ కె. బాబు, మాజీ కార్పొరేటర్ బండి ప్రసాద్, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు త్యాగరాజు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజన్న రాజ్యం తెస్తానని తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల, అక్కడి ప్రజలు ఛీకొట్టడంతో ఎన్నికల్లో కూడా పోటీ చేయలేక ఏపీకి వచ్చారని ధ్వజమెత్తారు. తెలుగు జాతిని అడ్డంగా విడగొట్టిన కాంగ్రెస్‌లో చేరి సొంత అన్నపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. జిల్లాలో ఆమె సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని.. ఇకనైనా ఆమెలో మార్పు రావాలన్నారు. జగనన్న చెల్లిగా ఆమె పాదయాత్ర చేస్తే జిల్లా ప్రజలంతా ఆమెకు బ్రహ్మరథం పట్టారని, నేడు పీసీసీ అధ్యక్షురాలిగా వస్తే పట్టుమని వందమంది కూడా హాజరుకావడం లేదన్నారు. 2019లో టీడీపీ ప్రభుత్వంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిందని, ఇన్నాళ్లు మౌనంగా ఉన్న షర్మిల, ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రవి పాల్గొన్నారు.

తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు చర్యలు



గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో మిషన్లను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక పుట్లంపల్లి, ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, ఆకుల వీధి గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. అక్కడి రిజిస్టర్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పుట్లంపల్లి వద్ద గార్బేజ్ రిజిస్టర్ లను పరిశీలించారు. వర్షాకాలంలో ఎంసీసీ షెడ్ వద్ద నీటి మడుగులు ఏర్పడకుండా పైపులు ఏర్పాటు చేయాలన్నారు. పిట్స్‌లో వేయడానికి రంపపు పొట్టు తెప్పించాలన్నారు. షెడ్‌కు వచ్చే గార్బేజ్‌ను తప్పనిసరిగా తూకం వేయాలన్నారు. జీటీఎస్‌లో పనిచేస్తున్న కార్మికుల కోసం తాగునీటి వసతి కల్పించాలన్నారు. పొడిచెత్తను అక్రమంగా గుజిరీ షాపులకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పొడిచెత్త ఎంత వస్తున్నది రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతిరోజూ 5టన్నుల వర్మీ కంపోస్టు తయారు కావాలన్నారు. కంపోస్ట్ జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, హార్టికల్చర్, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం అనేది ప్రతి మనిషి హక్కు

– కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ



క్విజ్ పోటీల్లో పాల్గొన్న వైద్య విద్యార్థులను అభినందిస్తున్న కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్: ఆరోగ్యం అనేది ప్రతి మనిషి హక్కు అని.. ప్రతి ఒక్కరికి ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ పేర్కొన్నారు. వైద్యులు వైద్యమే కాకుండా ప్రజలకు ఆరోగ్యం మీద అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సామాజిక ఆరోగ్యం విభాగంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.బి.బి.ఎస్ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరపు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రాముఖ్యతను, ఇతర అంశాలను గూర్చిన ప్రశ్నలను అడిగారు. ఈ క్విజ్ పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక వైద్య విద్య విభాగం, ఎం.బి.బి.ఎస్ విద్యార్థులు, పీజీ వైద్య విద్యార్థులు, నోడల్ అధికారి డాక్టర్ బెనర్జీ, డాక్టర్ లక్ష్మీదేవి, డాక్టర్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప అర్బన్: కడప సీపీ బ్రౌన్ గ్రంథాలయం రోడ్డులో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. నిందితుడు 54 క్వార్టర్ బాటిళ్ల మద్యంను వదిలేసి వెళ్లాడు. మద్యంను ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారు.